ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
బుధవారం, 02 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 19 | పేజీలు: 4 వెల: 5

## ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- పీఆర్సీ, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- ప్రజా సమస్యల పరిష్కారానికి 7న 'చలో అసెంబ్లీ'
- సామాజిక కార్యకర్త బక్క జడ్సన్



4

## బాధ్యతాయుతమైన జర్నలిజంతోనే
# సమాజానికి మేలు

- వార్త ప్రచురించే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలి
- ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలి
- సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మొద్దు
- టీడీఎంయూ లోగో ఆవిష్కరణలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత

**కాకతీయ, హన్మకొండ :** జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలను ప్రజల ముందుకు తీసుకురావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. వార్త కంటే వాస్తవం ముఖ్యం. సంచలనం కంటే ప్రజా ప్రయోజనం ముఖ్యమని అన్నారు. మంగళవారం తెలంగాణ డిజిటల్‌మీడియా యూనియన్ అధికారిక లోగోను కమిషనర్ శ్వేత ఆవిష్కరించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జర్నలిస్టు చేతిలోని కలం సమాజంపై ఎంతో ప్రభావం

........(తరువాయి 2లో)




## కేబినెట్‌లో మార్పులు
### ఢిల్లీకి కాంగ్రెస్ నేతల క్యూ!

- మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం
- అధిష్ఠానం పెద్దలతో వరుస భేటీలు
- మంత్రి కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు
- కేబినెట్ బెర్త్ కోసం నేతల లాబీయింగ్





**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. మంత్రివర్గంలో మాఁర్పులు, చేర్పులతో పాటు నామినేటెడ్ పదవుల భర్తీపై కూడా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన పలువురు కీలక నేతలు మంగళవారం ఢిల్లీ బాట పట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు అధిష్ఠానం పెద్దలను కలిసేందుకు

........(తరువాయి 2లో)

## రాష్ట్రంలో 1000 రోజుల
# కాంగ్రెస్ దగా పాలన

- సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు
- హామీలు, రైతులు, మహిళలు, యువత సమస్యలపై ప్రజల్లోకి వెళ్తాం
- కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది
- బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు

3



## ఆస్పత్రి ప్రారంభోత్సవం..
# అబాసుపాలు

### పరకాల ప్రభుత్వ ఆస్పత్రికి హడావుడిగా ప్రారంభోత్సవం

- పనులు పూర్తికాకముందే ఎమ్మెల్యే రేవూరి అమితోత్సాహం
- సీఎం చేతుల మీదుగా రెండు వారాల క్రితం ప్రారంభోత్సవం
- ఇప్పటికీ కొనసాగుతున్న పనులు.. ఆరంభమవని వైద్య సేవలు
- భవనాన్ని కాంట్రాక్టర్ హ్యాండోవర్ చేయలేదంటున్న సూపరింటెండెంట్
- ఫర్నిచర్, ఇతర వైద్య పరికరాలకు ప్రతిపాదనల దశలోనే ప్రక్రియ
- మరి ఆస్పత్రి ఎందుకు ప్రారంభించినట్లు..? అంతా ఉత్తుత్తిగానేనా ఎమ్మెల్యే సార్..!?






**కాకతీయ, వరంగల్ బ్యూరో :** పరకాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సుమారు రూ.35 కోట్లతో నిర్మించిన వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభోత్సవం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పనులు పూర్తి కాకముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆస్పత్రిని ప్రారంభించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల 16న పరకాలకు వచ్చిన సీఎం వర్చువల్‌గా ఆస్పత్రిని ప్రారంభించారు. అయితే ప్రారంభోత్సవం జరిగి రెండు వారాలు దాటినా.. ఆస్పత్రి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం, అవసరమైన వైద్య పరికరాలు, ఫర్నిచర్ ఇంకా సమకూరకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఒకవైపు ప్రారంభోత్సవం పూర్తయినట్లు ప్రకటించగా.. మరోవైపు పనులు కొనసాగుతుండటం ప్రభుత్వ తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

**ఆస్పత్రికి హడావుడిగా ప్రారంభోత్సవం**

........(తరువాయి 2లో)



## ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాల పర్వం

- డాక్యుమెంట్ రైటర్ల ద్వారా అదనపు వసూళ్లు?
- ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.5 వేల వరకు వసూలు
- తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆరోపణలు
- అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్




2

## రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్.. బీజేపీ కక్షనే

- కాషాయం పార్టీ రాజకీయ వైఖరికి నిదర్శనం
- ఈరోజు రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్.. రేపు ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై కేసు
- హల్దావానీలో దళితులను అవమానించిన వారిపై అట్రాసిటీ కేసు పెట్టాలి
- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ధ్వజం



4

## ధర్నాలు చేసే హక్కు బీఆర్ఎస్‌కు ఎక్కడిది..?

- పదేళ్లు ప్రజా గొంతు నొక్కి.. ఇప్పుడు ఆందోళనలతో హడావుడి..!
- రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులను బీఆర్ఎస్ పట్టించుకోలేదు
- అధికారం పోయాకే ప్రజలు గుర్తొచ్చారా..?
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై కాంగ్రెస్ చార్జ్‌షీట్
- హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి ధ్వజం




**కాకతీయ, వరంగల్ బ్యూరో :** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల గొంతు నొక్కి, ఆందోళనలు, ధర్నాలు, నిరసనలకు అడ్డంకులు సృష్టించిన ఆ పార్టీ నేతలు.. అధికారం కోల్పోయిన తర్వాత ప్రజాస్వామిక హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు, రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు తమ సమస్యలపై ప్రశ్నిస్తే అణచివేసిన బీఆర్ఎస్.. ఇప్పుడు ప్రజల సమస్యల పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టడం రాజకీయ నాటకమని అన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసిన తప్పులు, వైఫల్యాలకు ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్ పార్లమెంట్

........(తరువాయి 2లో)




## 420 హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా..?

- కాంగ్రెస్ దగా పాలనపై ప్రజలకు విసుగొచ్చింది
- కాంగ్రెస్ 1000 రోజుల మోసపూరిత పాలనపై బీఆర్ఎస్ సమరభేరి
- సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు వరుసగా నిరసన కార్యక్రమాలు
- హామీలు నెరవేర్చే వరకు పోరాడుతాం
- నగరంలో జరుగుతున్న భూ కబ్జాల వెనుక ఎమ్మెల్యే
- ఆయన కనుసన్నల్లోనే అనేక దారుణాలు
- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ధ్వజం

3

## ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు

- ప్రజలకు మెరుగైన రవాణానే లక్ష్యం
- మహాలక్ష్మి పథకంతో ఇప్పటివరకు 347.36 కోట్ల మంది ఉచిత ప్రయాణం
- 2,932 కొత్త బస్సుల కొనుగోలు.. మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు త్వరలో
- ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంతో పాటు సంస్థ అభివృద్ధికి చర్యలు
- ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల కాలంలో రవాణా శాఖ, ఆర్టీసీలో అనేక సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయడంతో పాటు కొత్త బస్సుల కొనుగోలు, ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం, ఉద్యోగాల భర్తీ, కార్మికుల సంక్షేమం, బస్‌స్టేషన్ల ఆధునికీకరణ వంటి చర్యలు చేపట్టామని చెప్పారు. బస్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్టీసీ, రవాణా శాఖ ప్రగతి వివరాలను మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 347.36కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా రూ.12,167 కోట్లు

........(తరువాయి 2లో)

# ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు

(మొదటిపేజీ తరువాయి)
ఆదా చేసుకున్నారని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈ పథకం దోహద పడుతోందని, అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయని సర్వేలు చెబుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా 600 బస్సులకు మహిళలను యజమానులుగా చేశామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 చొప్పున ఈఎంఐ చెల్లిస్తుండగా.. మొత్తం రూ.4 కోట్లు నెలకు చెల్లిస్తున్నామని, ఇప్పటివరకు రూ.29.31 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఉచిత ప్రయాణం అమలైన తర్వాత ఆర్టీసీ ఆక్యుపెన్సీ 67 శాతం నుంచి 89 శాతానికి పెరిగిందన్నారు.



**2,932 కొత్త బస్సులు**
ఆర్టీసీని ఆధునీకరించేందుకు ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశామని మంత్రి తెలిపారు. ఇందులో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని, హైదరాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను రోడ్డెక్కించనున్నట్లు వెల్లడించారు. పీఎం ఈడ్రైవ్ పథకం కింద హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నామని చెప్పారు. ఆర్టీసీని పేద ప్రజలకు లైఫ్‌లైన్‌గా అభివర్ణించిన పొన్నం ప్రభాకర్.. రైల్వే మాదిరిగానే ఆర్టీసీ ప్రజలకు జీవనాడిగా పనిచేస్తోందన్నారు. ఎంఎంటీఎస్, మెట్రో, ఆర్టీసీని సమన్వయం చేస్తూ లాస్ట్ మైల్ వరకు కనెక్టివిటీ కల్పిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో 370 కొత్త రూట్లలో బస్సులు నడుపుతున్నామని, గ్రామాల్లో బస్సు సౌకర్యం లేని ప్రాంతాలకు కూడా సర్వీసులు విస్తరిస్తున్నామని చెప్పారు.

**4,538 ఉద్యోగాల భర్తీ**
ఆర్టీసీలో 4,538 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని మంత్రి తెలిపారు. ఇందులో 1,000 డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామకాలు పూర్తయ్యాయని, వచ్చే నెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తామని చెప్పారు. మరో 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. నియామకాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పోలీస్ శాఖ ద్వారా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టామని పేర్కొన్నారు. కారుణ్య నియామకాల కింద 1,424 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, సర్వీసు నుంచి తొలగించబడిన దాదాపు 244 మంది ఉద్యోగులను ప్రత్యేక ఐఏఎస్ కమిటీ ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకున్నామని మంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు ఇచ్చామని, ప్రస్తుతం పెండింగ్ డీఏలు లేవన్నారు. ప్రతి నెల మంగళవారం కార్మికుల గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

**బకాయిలు తగ్గించాం**
ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పొన్నం ప్రభాకర్ అన్నారు. సీఎస్ఎస్ బకాయిలను రూ.1,096 కోట్ల నుంచి రూ.939 కోట్లకు, పీఎఫ్ బకాయిలను రూ.2,108 కోట్ల నుంచి రూ.1,710 కోట్లకు తగ్గించామని తెలిపారు. ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ బకాయిలను రూ.513 కోట్ల నుంచి రూ.485 కోట్లకు తగ్గించినట్లు వెల్లడించారు. తార్నాక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అభివృద్ధి చేశామని, బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. పెద్దపల్లి, ఏటూరునాగారం డిపోలను ఏర్పాటు చేశామని తెలిపారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని బస్‌స్టేషన్లను ఆధునీకరించడంతో పాటు అదనపు బస్సులు నడిపిస్తామని, మేడారం జాతరకు కూడా విజయవంతంగా బస్సు సర్వీసులు నిర్వహించామని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులతో అధికారుల కమిటీ ఏర్పాటు చేసి విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఇబ్బందులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్మికుల సంక్షేమంతో పాటు సంస్థ ప్రగతిని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఆర్టీసీలో వేధింపులకు తావులేకుండా రవాణా శాఖ చెక్‌పోస్టులను ఎత్తివేసిందని, జిల్లాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను పెంచామని తెలిపారు. టీఎస్ స్థానంలో టీజీగా మార్చామని, వాహన్, సారథి వ్యవస్థలను తీసుకొచ్చామని చెప్పారు. గత పదేళ్లుగా వాహన్ సారథిలో చేరని తెలంగాణను ముఖ్యమంత్రి సూచనలతో ఆ వ్యవస్థలోకి తీసుకొచ్చామని వెల్లడించారు.

**రోడ్డు భద్రతకు ప్రాధాన్యం**
రవాణా శాఖలో 113 ఏఎంవీఐలు, 50 మంది కానిస్టేబుళ్లు, 20 మంది జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు ఎంవీఐలను నియమించామని మంత్రి తెలిపారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టులను ప్రారంభిస్తున్నామని చెప్పారు. స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని, రోడ్డు భద్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పోలీస్ శాఖ ద్వారా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలను చేపడుతున్నామని, ప్రమాదం జరిగినప్పుడు బాధితులను వెంటనే ఆస్పత్రిలో చేర్చేందుకు రహవీర్ స్కీమ్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. రోడ్ సేఫ్టీ సెస్‌ను రోడ్డు భద్రత కోసం వినియోగించేలా చట్టం తీసుకొచ్చి ముందుకు వెళ్తున్నామని మంత్రి చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈవీ పాలసీ తీసుకొచ్చి రూ.1,400 కోట్ల పన్ను మినహాయింపులు ఇచ్చామని తెలిపారు. 240 డీజిల్ బస్సులను రీట్రోఫిట్ చేస్తున్నామని వెల్లడించారు.

**ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు**
ఆటో కార్మికులు సమ్మెకు వెళ్లకుండా వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2012 తర్వాత బస్సు చార్జీలు పెంచలేదని, చార్జీల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, వారం రోజుల్లో సమావేశం నిర్వహించి ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లో డీజిల్, పెట్రోల్ ఆటోలను రీట్రోఫిట్ చేసుకునేందుకు ప్రభుత్వం రూ.1.50 లక్షల సహాయం అందిస్తుందని తెలిపారు. బైక్ ట్యాక్సీలకు ఎల్లో ప్లేట్ పెట్టేలా ప్రతిపాదనలు చేస్తున్నామని చెప్పారు. రాత్రి వేళల్లో మహిళలకు భద్రత కల్పించేలా కొన్ని మార్గాల్లో నైట్ బస్సులు నడుపుతున్నామని వెల్లడించారు. ఆర్టీసీ దేశంలో ఉన్నత స్థానంలో నిలవడానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్ల కృషి అభినందనీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# కేబినెట్‌లో మార్పులు




(మొదటిపేజీ తరువాయి)
సిద్ధమవడంతో కేబినెట్ విస్తరణ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత ఇటీవల ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఆమెను మంత్రి పదవి నుంచి తప్పించే అంశంపై కూడా ఊహాగానాలు మొదలయ్యాయి. దీనిపై అధిష్ఠానం పెద్దలతో మాట్లాడేందుకు సురేఖ కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోరినట్లు సమాచారం.

**అగ్రనేతలతో భేటీ కానున్న కొండా సురేఖ**
కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా కొండా సురేఖకు అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం వేణుగోపాల్‌తో పాటు తెలంగాణ కాంగ్రెస్ నేతలతో జరిగే కీలక సమావేశంలో సురేఖ పాల్గొనే అవకాశం ఉంది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై అధిష్ఠానం ఆమెతో చర్చించే అవకాశమున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో సురేఖ మంత్రివర్గంలో కొనసాగుతారా? లేదా? అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఢిల్లీకి చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలతో ఆయన భేటీ కానున్నట్లు సమాచారం. ఇప్పటికే మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఢిల్లీలో ఉన్నారు. కేబినెట్ విస్తరణ, పార్టీ వ్యవహారాలు, నామినేటెడ్ పదవుల భర్తీ తదితర అంశాలపై అధిష్ఠానంతో చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**మల్లికార్జున ఖర్గేతో గడ్డం ప్రసాద్‌కుమార్ భేటీ**
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలను కలుస్తున్నారు. ఆయన మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించాలని ఖర్గేను కోరినట్లు ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణపై ఊహాగానాలు ఊపందుకోవడంతో ఆశావహులు అధిష్ఠానం పెద్దలను కలుస్తూ తమ అభ్యర్థిత్వాన్ని బలపర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లారు. ఆయన కేసీ వేణుగోపాల్‌ను కలిసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో అధిష్ఠానం హామీ ఇచ్చిందని రాజగోపాల్‌రెడ్డి చెబుతున్నారు. ఆ హామీని గుర్తు చేసేందుకే ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్న నేపథ్యంలో కేబినెట్ విస్తరణలో తనకు అవకాశం దక్కుతుందా అన్న చర్చ మొదలైంది. మరో ఆశావహుడు మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా ఢిల్లీకి చేరుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కొంతకాలంగా కోరుతున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ విస్తరణపై చర్చలు జరుగుతున్న తరుణంలో గడ్డం ప్రసాద్‌కుమార్ ఇప్పటికే అధిష్ఠానం పెద్దలను కలవడంతో మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మొత్తంగా తెలంగాణ కాంగ్రెస్ నేతల వరుస ఢిల్లీ పర్యటనలతో కేబినెట్ విస్తరణపై ఉత్కంఠ మరింత పెరిగింది.




# ధర్నాలు చేసే హక్కు బీఆర్ఎస్‌కు ఎక్కడిది?

(మొదటిపేజీ తరువాయి)
సభ్యురాలు డా. కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుతో కలిసి ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడారు.

**పదేళ్లు ప్రజా గొంతు నొక్కి.. ఇప్పుడు ధర్నాలా..?**
2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలు శాంతియుతంగా, అహింసా మార్గంలో ఉద్యమించే హక్కును పరిరక్షిస్తామని బీఆర్ఎస్ హామీ ఇచ్చిందని ఇనుగాల గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అందుకు భిన్నంగా వ్యవహరించిందని ఆరోపించారు. కాంగ్రెస్‌తో పాటు వివిధ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు చేపట్టిన కార్యక్రమాలకు అనుమతులు నిరాకరించారని విమర్శించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదమని ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని 2014, 2018 ఎన్నికల్లో హామీ ఇచ్చినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఇనుగాల విమర్శించారు. 80,039 ఉద్యోగాలను భర్తీ చేస్తామని అసెంబ్లీలో ప్రకటించినా ఆ హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. నిరుద్యోగులు ఆందోళనలు చేస్తే లాఠీచార్జీలు, అరెస్టులతో అణచివేశారని ఆరోపించారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలులో జాప్యం, పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపుల్లో బకాయిలు కూడా పేరుకుపోయాయని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాల అమలులోనూ వైఫల్యాలే**
గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్లు కాగ్ నివేదికలో వెల్లడైందని ఇనుగాల తెలిపారు. దళితబంధు పథకానికి భారీగా నిధులు కేటాయించినట్లు ప్రకటించినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. చేపలు, రొయ్యల పిల్లల పంపిణీలోనూ అవకతవకలు జరిగాయని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 2023 డిసెంబర్ నాటికి రూ.858 కోట్లకు పైగా బకాయిలు పెట్టారని అన్నారు. 2019లో ఆర్టీసీ ఉద్యోగులు 55 రోజులపాటు సమ్మె చేసినా వారి సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించలేదని ఇనుగాల విమర్శించారు. ఉద్యోగ భద్రత, వేతనాలు, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం తదితర డిమాండ్లతో ఉద్యోగులు సమ్మె చేసిన సమయంలో పలువురు మృతి చెందడం, ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని ఇనుగాల ఆరోపించారు. అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ప్రకటించినా అందరికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. ఉద్యమకారులపై ఉన్న కేసులను కూడా పూర్తిగా ఎత్తివేయలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన వారిని పట్టించుకోని బీఆర్ఎస్.. ఇప్పుడు ప్రజల హక్కుల గురించి మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు.

**అధికారం పోయాకే ప్రజలు గుర్తొచ్చారా..?**
రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యమకారులు, ప్రజాసంఘాల సమస్యలను పదేళ్లపాటు పట్టించుకోని బీఆర్ఎస్ నేతలకు అధికారం కోల్పోయిన తర్వాతే ప్రజలు గుర్తొచ్చారని ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. రైతులపై ప్రేమ ఉంటే అధికారంలో ఉన్నప్పుడే వారి సమస్యలను పరిష్కరించాల్సిందని, నిరుద్యోగులపై చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగాలు భర్తీ చేయాల్సిందని అన్నారు. ఇప్పుడు చేస్తున్న ధర్నాలు, నిరసనలు ప్రజల కోసం కాదని.. పోయిన అధికారం కోసం చేస్తున్న ఆరాటమని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలపై ప్రజలకు సమాధానం చెప్పిన తర్వాతే ప్రస్తుత ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఇనుగాల డిమాండ్ చేశారు.

# బాధ్యతాయుతమైన జర్నలిజంతోనే సమాజానికి మేలు




(మొదటిపేజీ తరువాయి)
చూపుతుందని అన్నారు. అదే సమయంలో నిర్ధారణ లేని సమాచారం ప్రచురిస్తే వ్యక్తుల గౌరవానికి, ప్రతిష్ఠకు నష్టం కలిగే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల ఏదైనా వార్తను ప్రచురించే ముందు దాని వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒక సమాచారం సంచలనాత్మకంగా ఉన్నంత మాత్రాన దాన్ని వెంటనే వార్తగా మార్చకూడదని అన్నారు.

**ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకోవాలి**
ప్రస్తుతం సోషల్ మీడియా విస్తృతంగా అందుబాటులోకి రావడంతో ఏ సమాచారం అయినా క్షణాల్లో వైరల్ అవుతోందని కమిషనర్ శ్వేత అన్నారు. అయితే వైరల్ అవుతున్న ప్రతి సమాచారం వాస్తవం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారాన్ని నిర్ధారించుకోకుండా ప్రచురించకూడదన్నారు. వైరల్ కావడం వేరు.. వాస్తవం కావడం వేరని అన్నారు. ఎక్కువ వ్యూస్, క్లిక్స్ కోసం సంచలనాత్మకంగా వార్తలను రూపొందించడం కంటే ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించడానికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, బాధితుల గళాన్ని వినిపించడం, అవినీతి, అక్రమాలను ఆధారాలతో వెలుగులోకి తీసుకురావడం జర్నలిజం లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. పోలీసులు, ప్రభుత్వ శాఖలు లేదా సంబంధిత అధికారుల నుంచి అధికారిక సమాచారం తీసుకున్న తర్వాతే ఏదైనా విషయాన్ని నమ్మాలని అన్నారు. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలు, బాధితులు, మహిళలు, పిల్లల విషయంలో వార్తలు రాసేటప్పుడు మరింత సంయమనం పాటించాలని సూచించారు. బాధితుల కష్టాలను సంచలనంగా మార్చకుండా వారి సమస్యలను సమాజం, అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా జర్నలిజం ఉండాలని అన్నారు. కార్యక్రమంలో టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు అరెల్లి కిరణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు, కోశాధికారి పల్లె వంశీ, ఉపాధ్యక్షుడు మోహన్, జాయింట్ సెక్రటరీ బూర నగేష్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, ఈసీ మెంబర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాల పర్వం

- డాక్యుమెంట్ రైటర్ల ద్వారా అదనపు వసూళ్లు?
- ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.5 వేల వరకు వసూలు
- తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆరోపణలు
- అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్

**కాకతీయ, ఉప్పల్** : ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ల పేరుతో అదనపు వసూళ్లు జరుగుతున్నాయంటూ తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఆస్తి రిజిస్ట్రేషన్‌కు అవసరమైన అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ డాక్యుమెంట్ రైటర్ల ద్వారా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా తీసుకుంటున్నారని ఆరోపించారు. ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు లంచాల రూపంలో వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రక్రియలో డాక్యుమెంట్ రైటర్ల ద్వారా అదనపు మొత్తాలను వసూలు చేస్తున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక కార్యాలయ స్థాయిలో ఎవరి వాటా ఎంత ఉందన్న విషయాన్ని విచారణ ద్వారా తేల్చాలని కోరారు. జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారుల స్థాయిలోనూ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**యూఎల్‌సీ భూమి రిజిస్ట్రేషన్‌పై అభ్యంతరాలు**
పీర్జాదిగూడలోని ఓ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్‌పైనా ప్రవీణ్‌కుమార్ ఆరోపణలు చేశారు. సర్వే నంబర్లు 39, 43, 44కు సంబంధించిన ఓ ఫ్లాట్ అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలో ఉన్నట్లు చూపుతున్నప్పటికీ రూ.2 లక్షలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అదే అపార్ట్‌మెంట్‌లో మరో ఫ్లాట్ రిజిస్ట్రేషన్‌కు వెళ్లినప్పుడు గతంలో పొరపాటున రిజిస్ట్రేషన్ జరిగిందని, ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేయడం సాధ్యం కాదని అధికారులు చెప్పినట్లు తెలిపారు. ఈ రెండు వ్యవహారాలపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. కార్యాలయంలో జరుగుతున్న అక్రమ వసూళ్లలో జిల్లా రిజిస్ట్రార్ నుంచి ఉన్నతాధికారుల వరకు నెలనెలా వాటాలు వెళ్తున్నాయంటూ వస్తున్న ఆరోపణలపైనా దర్యాప్తు చేయాలని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు తీసుకుంటూనే ప్రజల నుంచి అదనపు డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. ఉప్పల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిపై ప్రభుత్వం దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఎదుట తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

# ఆస్పత్రి ప్రారంభోత్సవం.. అబాసుపాలు

(మొదటిపేజీ తరువాయి)
వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయి, వైద్య సేవలకు అవసరమైన అన్ని సదుపాయాలు సిద్ధమైన తర్వాతే ప్రారంభోత్సవం నిర్వహించాల్సి ఉంటుంది. కానీ పరకాల ఆస్పత్రి విషయంలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగడంతో ఆస్పత్రి ఇక పూర్తిస్థాయిలో పనిచేస్తుందని ప్రజలు భావించారు. అత్యవసర వైద్యం కోసం వరంగల్, హనుమకొండ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని ఆశించారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న సౌకర్యాలను చూస్తే పూర్తి స్థాయి సేవలకు ఇంకా ఏర్పాట్లు చేయాల్సి ఉందని తెలుస్తోంది. దీంతో ప్రారంభోత్సవం కోసం ఎందుకింత హడావుడి చేశారన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**ఎమ్మెల్యే రేవూరి అమితోత్సాహం**
ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం పూర్తయి, అన్ని విభాగాలు పనిచేసే స్థితికి వచ్చిన తర్వాత ప్రారంభించడం సాధారణ ప్రక్రియ. అయితే పరకాల వంద పడకల ఆస్పత్రి విషయంలో నిర్మాణ పనులు, ఇతర ఏర్పాట్లు పూర్తికాకముందే కార్యక్రమం నిర్వహించడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై చూపాల్సిన శ్రద్ధ కంటే ప్రారంభోత్సవానికే ప్రాధాన్యం ఇచ్చారనే విమర్శలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తయిందనే దానికంటే.. ఆస్పత్రి ద్వారా వాస్తవంగా ఎప్పటి నుంచి పూర్తి స్థాయి వైద్య సేవలు అందుతాయనే అంశంపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. గత నెల 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరకాలలో పర్యటించిన సందర్భంగా వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని వర్చువల్‌గా ప్రారంభించారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభం కావడంతో ఆస్పత్రి సేవలు వెంటనే అందుబాటులోకి వస్తాయని ప్రజలు భావించారు. అయితే రెండు వారాలు గడిచినా అవసరమైన పరికరాలు, ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో ప్రారంభోత్సవానికి, వాస్తవ సేవలకు మధ్య వ్యత్యాసం స్పష్టమవుతోందని స్థానికులు అంటున్నారు.

**ఇప్పటికీ కొనసాగుతున్న పనులు**
ఆస్పత్రికి సంబంధించిన కొన్ని పనులు ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. భవనం నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికాకపోవడంతో పాటు రోగులకు అవసరమైన ఫర్నిచర్, వైద్య పరికరాలు, ఇతర సామగ్రి కూడా పూర్తిస్థాయిలో సమకూరలేదు. వంద పడకల ఆస్పత్రిగా ప్రకటించినప్పటికీ.. అందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు సిద్ధం కాకపోవడం వల్ల పూర్తిస్థాయి వైద్య సేవలు అందించేందుకు మరికొంత సమయం పట్టే పరిస్థితి కనిపిస్తోంది. వంద పడకల ఆస్పత్రి పూర్తిస్థాయిలో పనిచేయాలంటే బెడ్లు, ఫర్నిచర్, ల్యాబొరేటరీ సామగ్రి, అత్యవసర వైద్య పరికరాలు, ఇతర వైద్య పరికరాలు అవసరం. అయితే వీటిలో అవసరమైన సామగ్రి ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. పరికరాలు, సామగ్రికి సంబంధించిన వివరాలను ఇప్పటికే సంబంధిత అధికారులకు రాతపూర్వకంగా పంపినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. హైదరాబాద్ నుంచి పరికరాలు రావాల్సి ఉందని చెప్పారు. దీంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన ఆస్పత్రి భవనం సిద్ధంగా ఉన్నా.. అందులో వైద్య సేవలకు అవసరమైన సామగ్రి సమకూరే వరకు ప్రజలు పూర్తిస్థాయి సేవల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

**అంతా ఉత్తుత్తిగానేనా ఎమ్మెల్యే సార్..!?**
రూ.35 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించినప్పటికీ.. భవనం అధికారికంగా హ్యాండోవర్ కాకపోవడం, పనులు కొనసాగుతుండటం, వైద్య పరికరాలు, ఫర్నిచర్ ఇంకా సమకూరాల్సి ఉండటం ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తోంది. ప్రారంభోత్సవం జరిగిందా? లేక కేవలం కార్యక్రమం మాత్రమే నిర్వహించారా? ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు ఎప్పటి నుంచి అందుతాయి? అనే ప్రశ్నలకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించడం కంటే.. ఆస్పత్రిని అన్ని హంగులతో సిద్ధం చేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయడమే ముఖ్యమని స్థానికులు పేర్కొంటున్నారు.

**భవనాన్ని కాంట్రాక్టర్ హ్యాండోవర్ చేయలేదు : వంశీ,ఆస్పత్రి సూపరింటెండెంట్**



ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీని వివరణ కోరగా.. ప్రస్తుతం అవసరమైన వైద్య పరికరాలు ఇంకా ఆస్పత్రికి రాలేదని తెలిపారు. కాంట్రాక్టర్ నుంచి భవనం అధికారికంగా తమకు హ్యాండోవర్ కాలేదని చెప్పారు. ఆస్పత్రికి అవసరమైన పరికరాలు, సామగ్రి వివరాలను ఇప్పటికే సంబంధిత అధికారులకు రాతపూర్వకంగా అందజేశామని తెలిపారు. హైదరాబాద్ నుంచి పరికరాలు రావాల్సి ఉంది.. భవనం అధికారికంగా ఆస్పత్రి యాజమాన్యానికి అప్పగించకముందే ప్రారంభోత్సవం ఎలా నిర్వహించారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిర్మాణ పనులు పూర్తికాకపోవడమే హ్యాండోవర్ ఆలస్యానికి కారణమా? లేక ఇతర సాంకేతిక, పరిపాలనా అంశాలున్నాయా? అనే దానిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

# రాష్ట్రంలో 1000 రోజుల కాంగ్రెస్ దగా పాలన

- సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు
- హామీలు, రైతులు, మహిళలు, యువత సమస్యలపై ప్రజల్లోకి వెళ్తాం
- కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది
- బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు



**కాకతీయ, ములుగు ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు, డిక్లరేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు ములుగు జిల్లా వ్యాప్తంగా వరుస నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, వినతిపత్రాల సమర్పణ చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, 14 డిక్లరేషన్లు, గ్యారంటీలను ప్రకటించిందని లక్ష్మణ్‌బాబు గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో అనేక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. 1000 రోజుల పాలనలో రైతులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ అంశాలన్నింటినీ ప్రజల ముందుంచి ప్రభుత్వాన్ని నిలదీయడమే తమ లక్ష్యమని చెప్పారు.

**సెప్టెంబర్ 2 నుంచి వరుస నిరసనలు**

సెప్టెంబర్ 2న ములుగు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారంటీల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని లక్ష్మణ్‌బాబు తెలిపారు. సెప్టెంబర్ 3న గోవిందరావుపేటలో రైతుల సమస్యలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. రైతు భరోసా, రైతుబీమా, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, యూరియా కొరత తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో గోవిందరావుపేట మండలంలో పెద్ద సంఖ్యలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగు పెట్టుబడుల భారం రైతులను కుంగదీస్తోందని అన్నారు. సెప్టెంబర్ 4న మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ఏటూరునాగారం ప్రాంతంలో ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, పెన్షన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. సెప్టెంబర్ 5న విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై కార్యక్రమం చేపడతామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తామన్నారు. సెప్టెంబర్ 6న వెంకటాపురం మండల కేంద్రంలో స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన సమస్యలపై కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని, అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ఉపాధి హామీ పనులకు నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. సెప్టెంబర్ 7న ప్రజావాణిలో వినతిపత్రాలు సమర్పిస్తామని, సెప్టెంబర్ 8న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రాలు అందజేస్తామని లక్ష్మణ్‌బాబు వెల్లడించారు.

**మోసంలో రేవంత్‌రెడ్డిదే నంబర్ వన్**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని లక్ష్మణ్‌బాబు తీవ్రంగా విమర్శించారు. రైతులు, మహిళలు, వృద్ధులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేస్తూ.. ఆయనకు 'మోసపు పిత' అనే బిరుదు ప్రజల్లో నిలిచిపోతుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషిని ప్రజలు మరచిపోరని అన్నారు. కేసీఆర్‌ను ప్రజలకు దూరం చేయాలనే ప్రయత్నాలు ఎవరూ చేసినా ఫలించవని చెప్పారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని లక్ష్మణ్‌బాబు పేర్కొన్నారు. గత ఏడాది వడగండ్ల వానలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అందలేదని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

**మంత్రి సీతక్క సమాధానం చెప్పాలి**

ములుగు జిల్లాకు చెందిన మంత్రి సీతక్కకు కూడా పలు ప్రశ్నలు ఉన్నాయని లక్ష్మణ్‌బాబు అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, వరద బాధితుల పునరావాసం, సాగునీటి ప్రాజెక్టులు, వంతెనల నిర్మాణంపై ప్రభుత్వం ఏం చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ములుగు జిల్లాలో అర్హులైన గిరిజన కుటుంబాలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కొండాయి, ఊరుగుపేట తదితర ప్రాంతాల్లో వరదల కారణంగా ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదని ఆరోపించారు. రామప్ప నుంచి లక్నవరం వరకు అనుసంధాన పనులు మూడేళ్లుగా ముందుకు సాగడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేయడం కంటే కొత్త ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ములుగు జిల్లాగా ఏర్పాటు, ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా చేయడం, మల్లంపల్లి మండల ఏర్పాటు, వైద్య కళాశాల, ఆస్పత్రి వంటి అంశాల్లో చర్యలు తీసుకున్నామని తెలిపారు. రామప్పకు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా రావడంలోనూ గత ప్రభుత్వ కృషి ఉందని పేర్కొన్నారు. ములుగు ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని లక్ష్మణ్‌బాబు ఆరోపించారు. పామ్‌ఆయిల్ ఫ్యాక్టరీ కోసం రైతుల భూములు తీసుకుంటున్నప్పుడు వారికి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కమలాపురంలోని పేపర్ పరిశ్రమకు సంబంధించి కొత్త పరిశ్రమ ఏర్పాటు అంశంలోనూ ప్రభుత్వం ముందడుగు వేయడం లేదని విమర్శించారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. వెంకటాపురం మండలంలోని కేశవాపూర్, నర్సాపూర్ ప్రాంతాలకు సాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

**ఇక కోరడం కాదు.. డిమాండ్ చేస్తాం**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఇప్పటివరకు విజ్ఞప్తులు చేశామని, ఇకపై ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు స్పష్టం చేశారు. సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు చేపట్టే కార్యక్రమాలు రాజకీయ లబ్ధి కోసం కాదని, ప్రజా సమస్యలపై పోరాటంలో భాగంగానే నిర్వహిస్తున్నామని అన్నారు. ములుగు జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు స్పష్టం చేశారు.

# అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి

- వరంగల్ కలెక్టర్ సత్య శారద
- నార్కోటిక్ నియంత్రణపై అధికారులతో సమీక్ష



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** జిల్లాలో మాదకద్రవ్యాల నివారణ, అక్రమ రవాణా అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి నార్కోటిక్ నియంత్రణ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్, ఎక్సైజ్, రవాణా, వైద్య ఆరోగ్య, విద్య, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నమోదవుతున్న నార్కోటిక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాలు, రవాణా కేంద్రాలు, అనుమానాస్పద ప్రదేశాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. నార్కోటిక్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలు సేకరించాలన్నారు. విద్యార్థులు, యువత లక్ష్యంగా పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారికి వైద్య, పునరావాస సేవలు అందించాలని స్పష్టం చేశారు. నార్కోటిక్ నియంత్రణపై ప్రజల్లో చైతన్యం కోసం ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల తర్వాత... మళ్లీ ఒక్కచోట!

- సీకేఎం స్నేహబంధానికి చిరునామాగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- యూకే నుంచి స్నేహం కోసం వచ్చిన సాంబమూర్తి



**కాకతీయ, హన్మకొండ :** మూడు దశాబ్దాల కాలం.. మారిన జీవితాలు.. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులు.. అయినా చెక్కుచెదరని స్నేహబంధం. వరంగల్‌లోని ప్రముఖ సీకేఎం డిగ్రీ కళాశాలలో 1996లో బీఎస్సీ మ్యాథ్స్ చదువుకున్న పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత హనుమకొండలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో సమ్మేళనం ఆద్యంతం సందడిగా, ఆప్యాయంగా సాగింది. చాలా సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ కళాశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో చేసిన చిలిపి పనులు, సరదా సంఘటనలు, తరగతి గదిలో చోటుచేసుకున్న ఆసక్తికర ఘటనలను గుర్తుచేసుకుంటూ నవ్వుల్లో మునిగిపోయారు. ఒకప్పుడు కలిసి తిరిగిన స్నేహితులు నేడు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినా తమ మధ్య ఉన్న అనుబంధం మాత్రం మారలేదని ఈ సమ్మేళనం చాటిచెప్పింది.

**స్నేహం కోసం.. యూకే నుంచి!**

ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థి సాంబమూర్తి యూకే నుంచి ప్రత్యేకంగా రావడం ఆకర్షణగా నిలిచింది. కేవలం స్నేహితులను కలుసుకోవడంతోపాటు మూడు దశాబ్దాల నాటి జ్ఞాపకాలను మళ్లీ పంచుకునేందుకు ఆయన యూకే నుంచి హనుమకొండకు రావడం తోటి మిత్రుల్లో ఆనందం నింపింది. సాంబమూర్తిని స్నేహితులు ఆప్యాయంగా పలకరించి ఆయన రాకపై సంతోషం వ్యక్తం చేశారు. ''కాలం మారినా.. దూరాలు పెరిగినా.. స్నేహం మాత్రం చెరిగిపోదు'' అన్న మాటలకు ఈ సమ్మేళనం నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. విద్యార్థి దశ నుంచి నేటి వరకు సాగిన తమ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. పాత మిత్రులంతా కలిసి ఫొటోలు దిగుతూ సరదాగా గడిపి తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత కలిసిన స్నేహితుల ముఖాల్లో కనిపించిన ఆనందం, గతాన్ని గుర్తుచేసుకున్న కళ్లలో మెరిసిన జ్ఞాపకాలు, స్నేహబంధాన్ని మరోసారి సజీవం చేసిన ఆత్మీయ పలకరింపులతో ఈ సమ్మేళనం ఓ మధుర జ్ఞాపకంగా మారింది. పూర్వ విద్యార్థులు సంజయ్, సమ్మయ్య, స్వామి, నారాయణరెడ్డి, సాంబమూర్తి, వెంకట్, శ్రీనివాస్, చంద్రయ్య, రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

# 420 హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా..?

- కాంగ్రెస్ దగా పాలనపై ప్రజలకు విసుగొచ్చింది
- కాంగ్రెస్ 1000 రోజుల మోసపూరిత పాలనపై బీఆర్ఎస్ సమరభేరి
- సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు వరుసగా నిరసన కార్యక్రమాలు
- హామీలు నెరవేర్చే వరకు పోరాడుతాం
- నగరంలో జరుగుతున్న భూ కబ్జాల వెనుక ఎమ్మెల్యే
- ఆయన కనుసన్నల్లోనే అనేక దారుణాలు
- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ధ్వజం




**కాకతీయ, హన్మకొండ :** ఎన్నికల సమయంలో 420 హామీలు, ఆరు గ్యారంటీలను ప్రకటించి.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వాటిని అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తయినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు సెప్టెంబర్ 2 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విసుగు వచ్చిందని ఆయన అన్నారు. హామీలు నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 420 హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ప్రజలకు చెప్పిందని వినయ్ భాస్కర్ గుర్తుచేశారు. 1000 రోజులు పూర్తయినా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినీ పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలతోపాటు చెప్పని అనేక పథకాలను కూడా అమలు చేశామని పేర్కొన్నారు. ప్రజల పక్షాన ఇప్పటికే శాంతియుత నిరసనలు, ధర్నాలు చేపట్టామని తెలిపారు. ఇక బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 9వ తేదీ వరకు కాంగ్రెస్ హామీల అమలుపై విస్తృతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

**బాకీ కార్డులతో నిరసనలు : చల్లా ధర్మారెడ్డి**

తాము ఇచ్చిన బాకీ కార్డులతో పరకాల నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. కేసీఆర్ జూలై 7వ తేదీలోపు రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని, ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నది తామా? మీరా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులను చూసి కాంగ్రెస్ నేతలు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఏవి అమలు చేశారో చెప్పాలని ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేయని హామీలను అడగడం ప్రతిపక్ష నాయకుల బాధ్యత అన్నారు. కల్యాణలక్ష్మి పథకాన్ని ఆపాలని చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యూరియా కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. పరకాల ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్లకు ఒక్కో రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

**అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు రండి :**

**భూ కబ్జాలపై ఆరోపణలు..**

హనుమకొండ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే వెనుక ఉండి అనేక భూ కబ్జాలకు పాల్పడుతున్నారని వినయ్ భాస్కర్ ఆరోపించారు. నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే వెనుక ఉండి అనేక భూ కబ్జాలు జరిపిస్తున్నారని విమర్శించారు. రాజకీయ విమర్శలు చేసేటప్పుడు తనకు సంస్కారం ఉందని, అందుకే తాను బూతులు మాట్లాడటం లేదన్నారు. కాజీపేట వైఎస్సార్ నగర్‌లో గుడిసెలను తొలగించడం అభివృద్ధి ఎలా అవుతుందని ప్రశ్నించారు. మైనారిటీల షాదీఖానా నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కూడా తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విసుగు వచ్చిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద తనకు పలుకుబడి ఉందని చెబుతున్నారని, నిజంగా ఉంటే జీవో నంబర్ 97ను రద్దు చేయించాలని సవాల్ విసిరారు. కాజీపేట వైఎస్సార్ నగర్‌లో గుడిసెలు లేకుండా చేయడమే అభివృద్ధా? అని వినయ్ భాస్కర్ ప్రశ్నించారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు వెళ్తుండగా అక్రమంగా అరెస్టు చేయించారని వినయ్ భాస్కర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విసుగు వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్నానని చెబుతున్నావు కదా.. అయితే జీవో నంబర్ 97ను రద్దు చేయించు అంటూ సవాల్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**నన్నపనేని నరేందర్**

కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ పాలనను పక్కనపెట్టి పంచాయతీలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ విమర్శించారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది జీతాలను తగ్గించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌ను రాజీనామా చేయాలని ఎలా అడుగుతారని ప్రశ్నించారు. దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. ఢిల్లీకి పలుమార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఏం తీసుకొచ్చారని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.

# హంటర్ రోడ్డులో మీడియన్ కటింగ్ మూసివేత

- విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు ప్రయోగాత్మక చర్యలు
- న్యూ సైన్స్ కాలేజీ సమీపంలోని కటింగ్ తాత్కాలికంగా మూసివేత



**కాకతీయ, హన్మకొండ :** హనుమకొండ పట్టణంలోని హంటర్ రోడ్డులో అదాలత్ జంక్షన్ నుంచి నీలిమ జంక్షన్ వరకు ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంతోపాటు విద్యార్థుల సురక్షిత రాకపోకలను దృష్టిలో ఉంచుకుని అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మార్గంలో పాఠశాలలు, కళాశాలలు అధికంగా ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడంతోపాటు ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు హంటర్ రోడ్డులోని సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. మీడియన్ కటింగ్ మూసివేతతో వాహనదారులు ఇష్టానుసారంగా యూటర్న్‌లు తీసుకోవడం, రహదారిపై అకస్మాత్తుగా దిశ మార్చుకోవడం వంటి పరిస్థితులను నియంత్రించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల సమీపంలో విద్యార్థుల రాకపోకల సమయంలో ప్రమాదాల ముప్పును తగ్గించేందుకు ఈ చర్య దోహదపడుతుందని తెలిపారు. ఈ మార్పును వరంగల్ పట్టణ ప్రజలు, వాహనదారులు గమనించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. వాహనదారులు ట్రాఫిక్ సిబ్బంది సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు. హంటర్ రోడ్డులో ముఖ్యంగా విద్యార్థులు, పాదచారుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, వేగ నియంత్రణ పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకుండా బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని కోరారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన మీడియన్ కటింగ్ మూసివేత అనంతరం ట్రాఫిక్ పరిస్థితులను అధికారులు పరిశీలించనున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# నూతన జడ్పీ సీఈఓకు పంచాయతీ కార్యదర్శుల శుభాకాంక్షలు



**కాకతీయ, గీసుకొండ :** వరంగల్ జిల్లా పరిషత్ నూతన సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.వసంతను జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు యాకుబ్ రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు పూర్తి సహకారం అందిస్తారని యాకుబ్ రెడ్డి తెలిపారు. గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన సీఈఓగా ఎన్.వసంత సుదీర్ఘ అనుభవం జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సీఈఓ ఎన్. వసంత మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు పోలు రాజేంద్ర ప్రసాద్, రాంబాబు, వినోద్, మహేందర్, ఆకుల పృథ్వి, మురళీకృష్ణ, దేవేందర్‌తో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సీపీఎస్‌ను రద్దు చేసి.. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

- ములుగు జిల్లాలో నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం




**కాకతీయ,ములుగు ప్రతినిధి :** సెప్టెంబర్ 1ను పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ములుగు జిల్లాలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ములుగు జిల్లా పీజీ టీజీఈజేఏసి ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ శ్రీపోలు రాజు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానంను పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఉద్యోగుల భవిష్యత్ భద్రతకు పాత పెన్షన్ విధానమే కీలకమని నాయకులు పేర్కొన్నారు. సీపీఎస్ వల్ల ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితం ఆర్థిక అనిశ్చితికి గురయ్యే అవకాశం ఉందని, అందువల్ల ప్రభుత్వం తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసి కన్వీనర్ కే. జీవన్‌కుమార్ మాట్లాడుతూ ఓ పి ఎస్ ఉద్యోగుల హక్కు అని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఉద్యోగుల భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకుని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రభుత్వానికి పంపేందుకు గౌరవ రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మహేందర్‌కు ఉద్యోగ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్, డిప్యూటీ కన్వీనర్/కార్యదర్శి చైతన్య, డిటిఎఫ్ ఆదిరెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల అధ్యక్షుడు జి. రమేష్, జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలు సునీత, రిటైర్డ్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ చౌరస్తాలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి రోజులు దగ్గరపడ్డాయని బీజేపీ నాయకులు మండిపడ్డారు. ప్రతిపక్షాలపై కాంగ్రెస్ గుండాల దాడులకు నిరసనగా వరంగల్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ చౌరస్తాలో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు, జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇది వెయ్యి రోజుల ప్రజా పాలన కాదు, గుండాల పాలన అని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, బీజేపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండా రాజకీయాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, గోకే వెంకటేష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మదాసు రాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- పీఆర్సీ, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- ప్రజా సమస్యల పరిష్కారానికి 7న 'చలో అసెంబ్లీ'
- సామాజిక కార్యకర్త బక్క జడ్సన్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సామాజిక కార్యకర్త బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల నుంచి ఉద్యోగుల పీఆర్సీ, డీఏ వరకు పలు అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని బక్క జడ్సన్ కోరారు. ఉద్యోగులకు పీఆర్సీని అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీతో పాటు పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని బక్క జడ్సన్ అన్నారు. అర్హులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, జీపీఎఫ్, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, వైద్య రీయింబర్స్‌మెంట్ తదితర బకాయిలను కాలపరిమితితో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల వివరాలను ప్రభుత్వం పారదర్శకంగా వెల్లడించాలని, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న పెన్షనర్లు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను కూడా పరిష్కరించాలని తెలిపారు.

**కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత**

ఏళ్ల తరబడి ప్రభుత్వ సేవల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. చట్టపరంగా అర్హత ఉన్న చోట సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన ఉద్యోగుల కేసులను పునః పరిశీలించి న్యాయం చేయాలని అన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సేవా పరిస్థితులను సమీక్షించి అర్హత ఉన్న వారికి వేతనాలు, ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్ లేదా అబ్జార్ప్షన్‌కు ప్రత్యేక విధానం రూపొందించాలని కోరారు. శ్రీనిధి ఉద్యోగులకు పేస్కేలు, క్యాడర్ ఫిక్సేషన్, రెగ్యులరైజేషన్ కల్పించాలని, ఉపాధి, వీఆర్‌జీ రామ్‌జీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, తగిన వేతనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకంలో ఇప్పటికే మంజూరైన యూనిట్లకు నిధులు విడుదల చేయడంతో పాటు పెండింగ్ లబ్ధిదారుల జాబితాను ప్రకటించాలని, రాజీవ్ యువ వికాసం పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. హైడ్రా చర్యలతో ఇళ్లు కోల్పోయిన అర్హులైన కుటుంబాలకు నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని అన్నారు. రైతుల నుంచి సేకరించిన భూముల వినియోగంపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**30 రోజుల్లో చర్యలు ప్రకటించాలి**

ప్రజా సమస్యల పరిష్కారానికి చీఫ్ సెక్రటరీ స్థాయి ఉన్నతాధికారితో ప్రత్యేక గ్రీవెన్స్ రెడ్రెసల్ కమిటీ ఏర్పాటు చేయాలని బక్క జడ్సన్ కోరారు. 30 రోజుల్లో శాఖల వారీగా సమీక్ష నిర్వహించి యాక్షన్ టేకెన్ రిపోర్టును విడుదల చేయాలని, 90 రోజుల్లో పరిష్కరించగల సమస్యలకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం '1000 డేస్-ప్రామిస్ వర్సెస్ పెర్ఫార్మెన్స్' పేరుతో హామీలు, తీసుకున్న చర్యలు, జారీ చేసిన జీవోలు, లబ్ధిదారుల సంఖ్య, విడుదలైన నిధులు, పెండింగ్ వివరాలు, పూర్తి చేయాల్సిన గడువుతో కూడిన నివేదికను ప్రజల ముందుంచాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ పద్ధతిలో ఉద్యమాలను చేపడతామని తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 7న 'చలో అసెంబ్లీ', సెప్టెంబర్ 11 నుంచి శాంతియుత నిరాహార దీక్షలు చేపడతామని బక్క జడ్సన్ ప్రకటించారు. ప్రజా ఆస్తులకు నష్టం కలిగించకుండా, హింసకు తావులేకుండా శాంతియుతంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# బీఆర్ఎస్ పదేళ్ల పాలన.. 'దగా'ల చిట్టా!

- గాంధీభవన్‌లో 'అబద్ధాలు–వాస్తవాలు' ఫొటో ఎగ్జిబిషన్
- మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రచారం
- బీఆర్ఎస్ హామీలు, కాంగ్రెస్ సంక్షేమ పథకాలపై ప్రదర్శన

**కాకతీయ, హైదరాబాద్ :** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎన్ని అమలయ్యాయి? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది? అనే అంశాలను ప్రజల ముందు ఉంచుతూ గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన 'అబద్ధాలు-వాస్తవాలు' ఫొటో ఎగ్జిబిషన్ రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించింది. తెలంగాణ మత్స్య సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఈ ప్రదర్శన నిర్వహించారు. 'దశాబ్దపు దగా' వర్సెస్ 'ప్రజా పాలన' అనే అంశాన్ని ప్రధానంగా తీసుకుని బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ఒకవైపు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను మరోవైపు ప్రదర్శించారు. ఫొటోలు, పోస్టర్ల ద్వారా రెండు ప్రభుత్వాల పాలనలోని తేడాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు.

**డబుల్ బెడ్రూం ఇళ్లకు బదులు ఇందిరమ్మ ఇళ్లు**

ఈ సందర్భంగా తెలంగాణ మత్స్య సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తూ అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. ఉచిత కేజీ టు పీజీ విద్య హామీ అమలు కాలేదని సాయికుమార్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక సదుపాయాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతోందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

**సంక్షేమమే 'ప్రజా పాలన'కు కొలమానం**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని సాయికుమార్ తెలిపారు. గత పాలనలో ఇచ్చిన హామీలు, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మధ్య తేడాను ప్రజలకు వివరించేందుకే ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీఆర్ఎస్ పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



**కాకతీయ, ఏటూరునాగారం రూరల్ :** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం షీ టీం సభ్యులు సూచించారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు మంగళవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం వివరాలను అపరిచిత వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు.

సైబర్ మోసానికి గురై ఖాతా నుంచి డబ్బులు పోయినట్లయితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో ఎలాంటి చట్టపరమైన విధానం లేదని, అలాంటి ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. అదేవిధంగా మైనర్లకు వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 112 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. మహిళలపై అసభ్య ప్రవర్తన, వేధింపులు చోటుచేసుకుంటే 181 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని షీ టీం సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సమ్మూలాల్, కానిస్టేబుల్స్ బాలకృష్ణ, మేరాజ్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలే లక్ష్యం

- కేడీసీ–ట్రూ జాబ్స్ సొల్యూషన్స్ మధ్య అవగాహన ఒప్పందం
- ఉద్యోగ నియామకాలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం
- కెరీర్ మార్గదర్శకత్వం అందిస్తాం : ట్రూ జాబ్స్ సొల్యూషన్స్ సీఈఓ తాళ్లపల్లి కిషోర్



**కాకతీయ, హనుమకొండ:** విద్యార్థులకు మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించేందుకు కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండ–ట్రూ జాబ్స్ సొల్యూషన్స్, హైదరాబాద్ మధ్య మంగళవారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్, సంస్థ సీఈఓ తాళ్లపల్లి కిషోర్ ఒప్పందాన్ని పూర్తి చేశారు. ఇందులో భాగంగా రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు, కెరీర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను గుర్తించి, నియామక ప్రక్రియపై అవగాహన కల్పించనున్నారు. పరిశ్రమలు, ఉద్యోగ నియామక సంస్థలతో భాగస్వామ్యాలు విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంచుతాయని కాకతీయ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలతోపాటు కెరీర్ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని ట్రూ జాబ్స్ సొల్యూషన్స్ సీఈఓ తాళ్లపల్లి కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రజని లత, ప్రొఫెసర్ శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. ఎ. అనిల్ కుమార్, డా. శ్రీకాంత్, సంస్థ మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై కేసులు ఎత్తివేయాలి

- వరంగల్ లో కాంగ్రెస్ శ్రేణుల నిరసన
- ప్రజాస్వామ్యంపై దాడిని సహించం
- డీసీసీ అధ్యక్షుడు అయూబ్



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై యూపీలో అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ ఆదేశాల మేరకు వెంకట్రామ జంక్షన్ వద్ద ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో కేసులు పెట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రశ్నించే గొంతును అణచివేయాలని చూస్తే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదన్నారు. రైతులు, యువత, మహిళలు, పేదల సమస్యలపై రాహుల్ గాంధీ పోరాడుతున్నారని, రాజకీయంగా ఎదుర్కోలేకనే కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఇది వ్యక్తిపై దాడి కాదు, ప్రజాస్వామ్యంపై దాడి అని, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజల హక్కుల కోసమే కాంగ్రెస్ పోరాటం అన్నారు. కేసులను వెంటనే ఎత్తివేసి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకటరాజ్యం, ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్.. బీజేపీ కక్షనే

- కాషాయం పార్టీ రాజకీయ వైఖరికి నిదర్శనం
- ఈరోజు రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్.. రేపు ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై కేసు
- హల్ద్వానీలో దళితులను అవమానించిన వారిపై అట్రాసిటీ కేసు పెట్టాలి
- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ధ్వజం



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బీజేపీ కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూర్చున్న ప్రదేశాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గంగాజలంతో శుద్ధి చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. దళితుడు కూర్చున్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం దళితులను అవమానించడమేనని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు మంగళవారం గాంధీభవన్ నుంచి మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టినట్లు స్వర్ణ తెలిపారు. ర్యాలీగా వెళ్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో గాంధీభవన్ ఎదుటే శాంతియుత నిరసన చేపట్టామని చెప్పారు.

**కాషాయం పార్టీ రాజకీయ వైఖరికి నిదర్శనం**

హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ అనంతరం ఆయన కూర్చున్న ప్రదేశాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు గంగాజలంతో శుద్ధి చేశారని ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు. ఒక దళితుడు కూర్చుంటే ఆ ప్రదేశం అపవిత్రమవుతుందా? అని ప్రశ్నించారు. ఇదేనా బీజేపీ హిందుత్వం.. ఇదేనా ఆ పార్టీ సంస్కారం అని నిలదీశారు. ఖర్గేను అవమానించడం మాత్రమే కాదని, భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడమేనని అన్నారు. ఈ ఘటనను తమ నాయకుడు రాహుల్‌గాంధీ ధైర్యంగా ప్రశ్నించారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని తెలిపారు. అయితే నిందితులపై చర్యలు తీసుకోకుండా న్యాయం కోసం మాట్లాడిన రాహుల్‌గాంధీపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఏ విధమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యం కాదని, నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు.

**రేపు ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై కేసు**

కులగణన జరగాలని రాహుల్‌గాంధీ అడిగితే కేసు, మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కోరితే కేసు, దేశ సంపదను దోచుకుంటున్న అదానీ గురించి ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. దేశ రాజ్యాంగం, ప్రజల ఆత్మగౌరవం కోసం రాహుల్‌గాంధీ భయపడకుండా నిలబడుతున్నందుకే బీజేపీకి ఆయన అంటే భయమని అన్నారు. ఈరోజు రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే.. రేపు ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై ఎఫ్ఐఆర్ నమోదవుతుందని హెచ్చరించారు. ప్రజలు భయపడాలని బీజేపీ భావిస్తోందని, అయితే మహిళా కాంగ్రెస్ భయపడబోదని స్పష్టం చేశారు. తాము ఇందిరాగాంధీ వారసులమని, ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని అన్నారు.

**హల్ద్వానీలో దళితులను అవమానించిన వారిపై అట్రాసిటీ కేసు పెట్టాలి**

రాహుల్‌గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. అదే సమయంలో హల్ద్వానీలో శుద్ధీకరణ పేరుతో దళితులను అవమానించిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిరసన ఇక్కడితో ఆగదని, ఇది ఆరంభం మాత్రమేనని అన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన "దరో మత్.. భయపడకు" అనే పిలుపుతో ముందుకు సాగుతామని చెప్పారు. రాజ్యాంగం కోసం, దళితుల హక్కుల కోసం, మహిళల ఆత్మగౌరవం కోసం చివరి శ్వాస వరకు పోరాడుతామని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ గా ఎల్ కిషోర్ కుమార్

**కలెక్టర్ సత్య శారదను కలిసిన అదనపు కలెక్టర్**



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమితులైన ఎల్ కిషోర్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో రెవెన్యూ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. జిల్లా పరిపాలనలో సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

# జిల్లా పరిషత్ సీఈఓగా ఎన్ వసంత

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా నియమితులైన ఎన్ వసంత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిపాలనలో అన్ని విభాగాలతో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

# పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

- లక్ష్యం చేరకుంటే చర్యలు తప్పవు
- వార్డుల వారీగా వసూళ్లపై సమీక్ష
- రెవెన్యూ సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షించాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** పన్నుల వసూళ్లలో అలసత్వాన్ని సహించేది లేదని, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోని సిబ్బందిపై చర్యలు తప్పవని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న హెచ్చరించారు. మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాల అలుమిని ఆడిటోరియంలో రెవెన్యూ అధికారులు, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులతో పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. వార్డుల వారీగా ఆస్తిపన్ను వసూళ్లను పరిశీలించి, తక్కువగా ఉన్న డివిజన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి రోజువారీ లక్ష్యాలను సమీక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బకాయిలు వసూలు చేయాలని సూచించారు. పక్షం రోజుల్లో మరోసారి సమీక్ష నిర్వహిస్తామని, అప్పటికీ పురోగతి లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆస్తిపన్నుతోపాటు నీటిపన్ను బకాయిలను మార్చి 31లోగా వసూలు చేయాలని, కొత్త, రివైజ్డ్ అసెస్‌మెంట్లపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వరకట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య



చల్లా అఖిల పాత చిత్రం..

**కాకతీయ, ఆత్మకూరు:** వరకట్నం కోసం భర్త వేధించడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆత్మకూరు మండలం గూడెప్పాడ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గూడెప్పాడ్‌కు చెందిన చల్లా అఖిల (24)కు చల్లా ప్రవీణ్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. వివాహమైన రెండేళ్ల తర్వాత రూ.50 వేలు వరకట్నం తీసుకురావాలని ప్రవీణ్ తరచూ అఖిలతో గొడవపడేవాడని తెలిపారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన అఖిల మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని మృతిచెందినట్లు పేర్కొన్నారు. ప్రవీణ్‌పై బీఎన్ఎస్‌లోని 85, 80 సెక్షన్లతోపాటు వరకట్న నిషేధ చట్టంలోని 3, 4 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు ఎస్సై తిరుపతి తెలిపారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**కాకతీయ, ఏటూరునాగారం రూరల్:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం మంగపేట రోడ్డులోని చింతలదారి సమీపంలో వ్యవసాయ భూమిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. రాత్రి 8.30 గంటల సమయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఉప్పు రాజేందర్, కుంబం రాజేష్, మిరియాల నరసింహ, ఎస్.కె. అజ్మత్, మునిగేలా పూర్ణచందర్, కేశవనేని వెంకన్నలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,18,430 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏటూరునాగారం ఎస్సై తెలిపారు. పెట్రోలింగ్‌లో హెచ్‌సీ జీ. కృష్ణతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి ఎరువుల పంపిణీలో నూతన విధానం

- ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు
- మండల వ్యవసాయాధికారి యాస్మిన్

**కాకతీయ,ఇనుగుర్తి:** రైతులకు అవసరానికి అనుగుణంగా ఎరువులను పారదర్శకంగా సులభతరంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా "ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్)నూతన డిజిటల్ విధానాన్ని నేటి నుంచి అమలులోకి తీసుకువస్తున్నట్లు ఇనుగుర్తి మండల వ్యవసాయ అధికారి షేక్ యాస్మిన్ తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు అమలులో ఉన్న రాష్ట్ర ఎరువుల విక్రయాల యాప్ స్థానంలో కేంద్ర ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. రైతులు తమ మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఎఫ్ఎఫ్ఎఫ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకోవాలని, ఫార్మర్ ఐడి ఉన్న రైతులు రైతు గుర్తింపు కార్డు లేదా ఆధార్ సంఖ్య ద్వారా లాగినయ్యి, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటిపి ద్వారా తమ వివరాలను ధృవీకరించుకోవచ్చన్నారు. కొంతమంది రైతుల భూమి వివరాలు ఫార్మర్ రిజిస్ట్రీలో అందుబాటులో లేకపోవచ్చు. వీరు యాప్‌లోని 'సింక్ ల్యాండ్ విత్ ఫార్మర్ మినిస్ట్రీ' సదుపాయాన్ని ఉపయోగించి భూమి వివరాలను సమకాలీకరించు కోవచ్చు అని తెలిపారు.అయినప్పటికీ భూమి వివరాలు అందుబాటులోకి రాకపోతే యాడ్ క్లెయిమ్ ల్యాండ్ ద్వారా భూమి వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. రైతులు తమకు అనుకూలమైన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఎంపిక చేసి దరఖాస్తు సమర్పించిన తర్వాత యాప్‌లో క్యూఆర్ కోడ్ మరియు టోకెన్ నెంబర్ రూప అందుతుందని, క్యూఆర్ కోడ్ ఆధారంగా రైతులు ఎరువులను పొందవచ్చని దీనిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి యాస్మిన్ రైతులకు సూచించారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266